ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

గురువారం 1 ఆగస్టు 2024





- విద్యార్థుల ప్రవేశాలు లేక వెలవెల
- సగానికి పైగా సీట్లు ఖాళీలు
- ఇంటింటి ప్రచారం నిర్వహించినా పెరగని ప్రవేశాలు
- గురుకులాలు, కేజీబీవీలు, మోడల్, సంక్షేమ విద్యాసంస్థలతో తగ్గుతున్న ఆదరణ
- ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి సారిస్తేనే మేలు

చిన్నబోతున్న.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు అందజేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రవే శాలు జరగడం లేదు. కళాశాలలో పరీక్షా ఫలితాలు అంతంతమాత్రం గానే వస్తుండడం, నిధుల కొరత, సమస్యలు, మధ్యాహ్న భోజన పథకం అమల్లో లేకపోవడం, గురుకులాలు, కస్తూర్బాలు, మోడల్ స్కూల్స్ అప్‌గ్రేడ్ అయి కళాశాల ప్రవేశాలు నిర్వహిస్తుండడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ కళాశాలల వైపు విద్యార్థుల తల్లి దండ్రులు ఆసక్తి చూపుతుండడంతో ప్రభుత్వ కళాశాలల్లో చేరే వారి సంఖ్య ఏ యేటికి ఆ యేడు తగ్గుముఖం పడుతోంది. కొందరు తల్లి దండ్రులు ఆర్థిక స్తోమత లేకున్నప్పటికీ తమ పిల్లలను ప్రైవేటు కళాశాలల్లో చేర్పించేందుకే ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో సుశిక్షితులైన అధ్యాపకులుండి, వారు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించినా ప్రవేశాల సంఖ్య పెరగడం లేదు.

సగానికి పైగా సీట్లు ఖాళీలు...

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు పలు కళాశాలల్లో వృత్తివిద్యా కోర్సులు కూడా నిర్వహిస్తున్నారు. ఒక్కో విభాగంలో 40 నుంచి 80 సీట్లున్నాయి. ఇంగ్లీష్, తెలుగు మీడియం కోర్సులు కలిపి ప్రథమ సంవత్సరంలో సుమారు ఐదు వేల పైచిలుకు సీట్లున్నాయి. అయితే ఇప్పటివరకు కేవలం 2,502 మంది విద్యార్థులు మాత్రమే ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. వీరిలో 1,812 మంది జనరల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందగా, సుమారు 484 మంది ఒకేషనల్ కోర్సుల్లో చేరారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 422 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా ఇందులో సుమారు లక్షకు పైగా ప్రథమ సంవత్సరంలో వివిధ కోర్సుల్లో సీట్లున్నాయి. ఇప్పటివరకు సుమారు 72,048 మంది మాత్రమే ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందినట్లు ఇంటర్ విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. హైద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు ఎక్కువగా ఉంటున్నాయి. పలువురు విద్యార్థులు హైద్రాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొంది పార్ట్ టైం పనులు చేసుకుంటుండడం కారణమని తెలుస్తోంది.

ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం

నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి, జగిత్యాల



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాము. లెక్చరర్లు ఇంటింటి ప్రచారం పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశానికి గడువును పెంచే అవకాశం ఉంది. ప్రైవేటు కళాశాలలతో పాటు గురుకులాలు, మోడల్ స్కూల్స్ కస్తూర్బా, సంక్షేమ కళాశాలలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పోటీగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి

దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జగిత్యాల



ప్రభుత్వం కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. విద్యార్థులకు మధ్యాహ్నం తినడానికి లంచ్ బాక్స్ తీసుకురావడం కష్టంగా మారుతుంది. దీంతో మధ్యాహ్నం తినకుండానే ఖాళీ కడుపుతో ఉంటున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి. మధ్యాహ్న భోజనం లేక పోవడం, ఇతర సమస్యలు తిష్ట వేయడం వల్ల ప్రభుత్వ కళాశాలల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.

వేధిస్తున్న సమస్యలు...

జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపల్, లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలువురు లెక్చరర్లు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. మరి కొందరు గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించి తరగతులు బోధిస్తున్నారు. ప్రతీకళాశాలలో ఒక లైబ్రేరియన్ ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల ఖాళీగా ఉంటున్నాయి. క్రీడలపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఆటలు కలగానే మిగిలిపోతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వ్యాయామ లెక్చరర్ల పోస్టులు భర్తీ కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా కనీసం ఒక్క కళాశాలలోనైనా ఫిజికల్ డైరెక్టర్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉండడం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసే చాలా మంది విద్యార్థులు పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉంటున్నారు. వివిధ గ్రామాల నుంచి, ఆయా ప్రాంతాల్లో హాస్టల్స్‌లలో ఉంటూ చదువు కుంటున్నారు.

తమ సమయానికి ఉదయం పూట ఏది ఉంటే అది తిని వస్తున్నారు. మధ్యాహ్నం అర్ధాకలితో అలమటించే పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్న భోజన పథకం అందుబాటులో తెస్తామన్న హామీ ఇప్పటికీ అమలు కావడం లేదు. పలు ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు రాజ్యమేలుతుండడం వల్ల పిల్లలు గురుకులాలు, కేజీబీవీలు, మోడల్స్ స్కూల్స్, ప్రైవేటు బాట పడుతున్నారు. సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా ప్రత్యేకత కనబరిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పూర్వ కళ సంతరించుకుని సాకారమయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీట్లు భర్తీ కాకపోవడానికి ఎన్నో కారణాలు...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీట్లు భర్తీ కాకపోవడానికి అనేక కారణాలున్నాయి. ప్రభుత్వం శాశ్వత లెక్చరర్ల నియామకం చేపట్టకపోవడం, గెస్ట్ లెక్చరర్లతో కాలం వెళ్లదీస్తుండడం, అదే విధంగా ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడం ప్రవేశాలపై ప్రభావం చూపుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులను ఊరిస్తున్న మధ్యాహ్న భోజనం కలగానే మిగలడం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారు. ఫలితంగా పిల్లలను దూరం పంపేందుకు తల్లి దండ్రులు ఆసక్తి చూపడం లేదు. తల్లిదండ్రులు పిల్లలను ఒకే చోట ఉంచి చదివించడానికే ఆసక్తి చూపు తున్నారు. పదో తరగతి ముగియగానే గురుకులాలు, మోడల్ స్కూల్, బీసీ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కళాశాలలు, బాలికలైతే కస్తూర్బాలలో ప్రవేశాల కోసం పరుగులు తీస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి కళాశాలలకు వస్తున్న నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదని లెక్చరర్లు వాపోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశం పొందడానికి జూలై 31వ తేదీతో గడువు ముగిసినప్పటికీ ఆగస్టు 15వ తేదీ వరకు పొడగించే అవకాశాలున్నట్లు ఇంటర్ విద్యా శాఖ వర్గాలు అంటున్నాయి.

శిథిల భవనం.. విద్యార్థులకు సంకటం

- కూల్చడానికి డబ్బులు లేక నిర్లక్ష్యం
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



శిథిలమై కూలుతున్న పాఠశాల గదులు

మల్యాల, జూలై 31: శిథిలమైన పాఠశాల భవనం విద్యార్థులకు సంకటంగా మారింది. అయినా దాన్ని కూల్చకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తాటిపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలమై కూలుతుండడంతో దాని పక్కనే అయిదేళ్ల క్రితమే నూతన పాఠశాల భవనం నిర్మించారు. నూతన కట్టడం పూర్తి అయ్యాక శిథిల భవనం తొలగించాల్సి ఉండగా అలాగే వదిలిపెట్టారు. దీంతో అది తరచూ కూలుతూ ప్రమాదకరంగా మారింది. శిథిల భవనం కూల్చివేయాలని విద్యాశాఖ అధికారులు మూడేళ్ల క్రితమే అనుమతి ఇచ్చినప్పటికీ తొలగించడానికి డబ్బులు లేవనే సాకుతో దాన్ని ముట్టుకోవడం లేదు. నిత్యం విద్యార్థులు దాని పక్క నుంచి వెలుతూ, వస్తూంటారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి ఖర్చుకు పెద్ద ప్రమాదంను నిర్లక్ష్యంతో కొనసాగిస్తుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో తరగతి గది

ఇన్‌చార్జి డీపీవోగా రఘువరన్

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా ఫుల్ అడిషనల్ చార్జీ(ఎఫ్ఏసీ) బాధ్యతలను జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ బుధవారం స్వీకరించారు. జిల్లా పంచాయతీ అధికారిగా వ్యవహరిస్తున్న దేవరాజు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లడంతో ఫుల్ అడిషనల్ చార్జీ బాధ్యతలను డిప్యూటీ సీఈవో రఘువరన్ అప్పగిస్తూ ఉన్నతాధి కారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలను స్వీకరించారు.



డీపీవోగా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న రఘువరన్

శాసన మండలి చైర్మన్‌ను కలిసిన మాజీ మంత్రి రాజేశం



మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డితో మాట్లాడుతున్న రాజేశం

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని బుధవారం జగిత్యాల జిల్లాకు చెందిన మాజీ మంత్రి రాజేశం గౌడ్ కలిశారు. హైద్రాబాద్‌లో మాజీ ఎమ్మెల్యేల అసోసియేషన్ ఆధ్వర్యంలో గుత్తా సుఖేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ధర్మపురి మున్సిపల్ సమావేశం

ధర్మపురి, జూలై, 31:ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్ పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులతో కలిసి ఆమె పలు సమస్యల గురించి చర్చించి మొత్తం 22 అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో కమలపూర్, నక్కలపేట ఇందిరమ్మ కాలనీ, వివిధ వార్డుల్లో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వార్డులలో కొత్త మోరటర్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. హరితహారంలో మొక్కలు నాటుటకు కూలీలను ఎంగేజ్ చేయాలని యనిమల్‌బర్త్ సెంటర్ ఏర్పాటు, సానిటేషన్ వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు, ఇన్విరాల్‌మెంట్ ఇంజనీర్ వేతనం పెంపు, బస్తీ దవఖానకు స్థలం కేటాయింపు పై చర్చించి తీర్మాణం చేశారు. మార్చి 2024 నుండి జూన్ 2024 వరకు సంబంధించిన ఆదాయ వ్యయాలు, ఇతరల బిల్లులకు సంబంధించిన మొత్తం 22 అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, కమీషనర్, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ జెఏఓ గణేష్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, మేనేజర్ గంగాధర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన డీఏవో





ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న డీఏవో, నాటు వేస్తున్న డీఏవో, అధికారులు

కొడిమ్యాల, జూలై 31: మండల కేంద్రంలోని, మండలంలోని డబ్బు తిమ్మయ్యపల్లి, కోనాపూర్ గ్రామాల్లోని ఐదు ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి బి వాణి బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ వివరాలను పరిశీలించారు. మండలంలోని సూరంపేటలో పంటల నమోదును సర్వే నంబర్ల వారీగా పరిశీలించారు. రుణమాఫీ గురించి రైతుల కూలీలతో మాట్లాడారు. గ్రామాల్లో వరినాట్లు ఏ మేరకు పూర్తయ్యాయని మహిళా కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో కలిసి వరి నాటు వేశారు. ఏవో పి జ్యోతి, ఏఈవో గ్రీష్మ, రైతులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించాలి



డబ్బాలో మురికి కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల ఆడిటోరియంలో ఎంపీడీవోలు, మండల వైద్యాధికారులు, ఆశావర్కర్లు, సూపర్ వైజర్లతో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పల్లెల్లో పరిశుభ్రత ఉండేలా జాగ్రత్తలు వహించాలన్నారు. డెంగ్యూ కేసులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ సెక్రెటరీలు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. సమయపాలన పాటించని పంచాయతీ సెక్రెటరీలను సస్పెండ్ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లోకల్ బాడీ అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, ఇంచార్జీ డీపీవో రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

● శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దు..

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండ అధికారులు, వైద్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం మండలంలోని డబ్బ గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ఆశ వర్కర్లు వస్తున్నార లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఎప్పటికప్పుడు మురుగు నీటిని శుభ్రం చేయాలని అన్నారు. అనంతరం గ్రామ శివారులోని డంపింగ్ యార్డును పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరుగా వేయాలని సూచించారు. వాటర్ గ్రిడ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నీటి యొక్క లేబొటరి పరిశీలించి ఎన్ని పరీక్షలు చేస్తున్నారని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తు సరఫరా చేయాలని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించాలి

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తల్లి పాల ప్రాముఖ్యంపై గ్రామస్థాయి నుంచి అందరికి అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో పోషణ్ అభియాన్, తల్లిపాల వారోత్సవాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడారు. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు గ్రామాల్లో వాడవాడన పర్యటించి గర్భిణులు, బాలింతలు, మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధిఆరి డాక్టర్ బోనగిరి నరేశ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈఓ రఘువరన్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బాలికపై అత్యాచారం కేసులో..

నిందితుడికి 25 సంవత్సరాల జైలు శిక్ష

- రూ. 5 వేల జరిమానా
- బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెగడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బాలికను కొలిపాక అంజయ్య (66) అనే వ్యక్తి అత్యాచారం చేసిన ఘటనలో విచారణ అనంతరం జిల్లా న్యాయాధికారి నీలిమ నిందితుడికి బుధవారం 25 సంవత్సరాల కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమాన, బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సంఘటనపై పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేయగా, డీఎస్పీ వెంకటస్వామి, రఘుచందర్ కేసు విచారించినట్లు తెలిపారు. జనవరి 3న సంఘటన జరగగా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో విచారణ జరిపి ఈ మేరకు తీర్పు వెలువరిచారు. ఆధారాలు సమర్పించి పీపీ, కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా విచారించిన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి శిక్ష విధించినట్లు వివరించారు. సంబంధిత కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీ మల్లికార్జున్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు వెంకటస్వామి, రఘుచందర్, ఎస్ఐలు సతీష్, రాజు నాయక్, కోర్టు కానిస్టేబుల్ సాగర్, కిరణ్‌ను ఎస్ అశోక్ కుమార్ అభినందించారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కరీంనగర్ టౌన్, జూలై 31: గంజాయి, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచివారితో స్నేహం చేసి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.జగన్మోహన్‌రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్, కామర్స్)లో విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా మంచి అలవాట్లతో ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తములుగా సమాజానికి సేవ చేసే విధంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సత్యవర్ధన్‌రావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ రాబర్ట్, మహిళాశిశు సంక్షేమశాఖ అధికారి శాంత, జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, కలాశాల అధ్యాపకులు వి.రవీందర్‌రెడ్డి, బి.సంపత్, జి.జాన్సన్, రమణాచారి, శశిధర్ శర్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ అద్దె బస్సులు

భగత్‌నగర్, జూలై 31: రానున్న శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అద్దె ప్రాతిపదికన వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అద్దె ప్రాతిపదికన బస్సులు అవసరమైన వారు ఆయా డిపోల్లో సంప్రదించాలన్నారు. గోదావరిఖని 9959225922, హుస్నాబాద్ 9959225930, హుజూరాబాద్ 9959225924 కరీంనగర్-1 డిపో 9959225920, కరీంనగర్-2 9959225921, మంథని 9959225923, జగిత్యాల 9959225925, కోరుట్ల 9959225928, మెట్‌పల్లి 9959225927, సిరిసిల్ల 9959225929, వేములవాడ 9959225926 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణమునకు 11 డిపోల పరిధిలో ముందస్తుగా బస్సులను బుక్ చేసుకోవాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పడిగెల శ్రీనివాస్

జగిత్యాలరూరల్, జూలై 31: జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల శ్రీనివాస్ (44) అనే రైతు అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన ఆరెకరాల వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల రూ. 20 లక్షలు అప్పుచేసి గేదెల ఫామ్ నడిపించి నష్టాలపాయ్యాడు. బుధవారం ఉదయం శ్రీనివాస్ తన పొలం వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

● నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు

పెద్దపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 5,914 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1217 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4,697 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.715 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ ద్వారా 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ప్రాజెక్టులోకి వరద నీరు రాక పోవడంతో ఎత్తిపోతల్లో భాగంగా ఒక మోటార్‌ను నిలిపి వేశారు. ఇప్పటి వరకు సుమారు నాలుగు టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.

గాయత్రి పంప్ హౌస్ నుంచి...

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఐదో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. మూడు రోజులుగా ఐదు పంపుల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు బుధవారం ఓ పంపును తగ్గించారు. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా విడుదలను యదావిధిగా సాగిస్తున్నారు. 4 పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలి వెళ్తున్నది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని 4 పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం ఉప్పొంగుతూ ప్రవ హిస్తోంది.గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరదకాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతోంది. నీటిని విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలలో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది.


గాయత్రి పంప్‌హౌస్ నుంచి విడదలవుతున్న నీరు

మిడ్ మానేరుకు 14 వేల క్యూసెక్కులు...

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు 14,814 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు గాను 309.45 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.55 టీఎంసీల మేరకు నీటి నిల్వ ఉంది.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 8,278 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 36.075 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.133 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.578 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

జాలరికి చిక్కిన 30 కిలోల చేప


30కిలోల భారీ చేపతో జాలరి కూర పురుషోత్తం

కరీంనగర్ టౌన్, జూలై 31: కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ)లో బుధవారం జాలరి చేపలు పడుతుండగా 30 కిలోల భారీ చేప వలలో పడింది. కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన జాలరి కూర పురుషోత్తం ఎల్ఎండీలో చేపల వేటకు వెళ్లాడు. ఆయన వల వేయగా 30 కిలోల చేప (బొచ్చె) వలలో పడింది. దీనితో ఆయనతో పాటు అక్కడనున్న జాలర్లు, సందర్శకులు ఆ చేపను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎల్ఎండీ జలాశయంలో ఇంత పెద్ద చేప దొరకడం అరుదని పురుషోత్తం తెలిపారు. ఈ చేపను కిలో 110 రూపాయల చొప్పున 3,300 రూపాయలకు విక్రయించాడు.



దుర్శేడ్‌లో ఇద్దరికి డెంగ్యూ

కరీంనగర్ రూరల్, జూలై31: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఇటీవల రెండు డెంగ్యూ కేసులు నిర్ధారణ అయ్యాయి. గ్రామానికి చెందిన బుర్ర ప్రణయ్, వడ్లూరి లక్ష్మీకి మూడు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండగా డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. వెంటనే మండల అధికారులు గ్రామానికి చేరుకుని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో పలు కాలనీల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించారు. ఇళ్లల్లో నీరు నిలిచిన వాటిని గుర్తించి తొలగించారు. మండల పంచాయతీ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి సంజీవరెడ్డి, ఆశా వర్కర్లు గ్రామంలో పర్యటించి డెంగ్యూ నివారణ చర్యలు చేపట్టారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

గంభీరావుపేట, జూలై 31: గంభీరావుపేట మండలం ముచ్చర్ల తండాకు చెందిన భూక్య దేవదాస్ (45) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని దేవదాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాంమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఇల్లు కట్టడం వల్ల దేవదాస్ అప్పుల పాలయ్యాడు. ఏడాది కిందట తన కొడుకు గల్ఫ్‌లో మృతి చెందాడు. మరోవైపు అప్పుల ఒత్తిళ్లు కావడంతో దేవదాస్ మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

గిరిజన రైతు అత్మహత్యాయత్నం

వీర్నపల్లి, జూలై 31: వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలో బుధవారం రాత్రి గిరిజన రైతు పురుగుల మందు తాగి ఉత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం బాబాయ్ చెరువు తండాకు చెందిన అజ్మీరా రాజు అనే గిరిజన రైతు అటవీ భూముల్లో పంటను సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనరైతు అటవీ శాఖ బీట్ అధికారి కిరణ్ మధ్య వాగ్వాదం జరిగింది. తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఎల్లా రెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఫారెస్ట్ బీట్ అధికారి తనపై దాడిచేశాడంటూ అవేదన చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రాజు తెలిపాడు. ఈ సంఘటనపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్‌ను వివరణ కోరగా అటవీ భూమిని సాగు చేస్తున్నాడనే సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లిన బీట్ అధికారిపై గిరిజన రైతు రాజు దాడి చేసినట్లు పేర్కొన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,జూలై31:మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొర్కల్ గ్రామ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న టాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. టాక్టర్ డ్రైవర్ అజారోద్దిన్ ఓనర్ వీరవేణి అంకుస్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐతెలిపారు.అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

- ఏసి చంద్రశేఖర్ మెదక్‌కు బదిలీ - కొండగట్టు ఈఓగా రామకృష్ణారావు


కరీంనగర్ కల్చరల్, జూలై 31: దేవాదాయ శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. దీర్ఘకాలంగా ఉన్న సిబ్బందిని, అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి బదిలీల ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్‌గా, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ ఇంచార్జ్ ఈఓగా ఉన్న ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లా ఏసిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరో ఒకరు సీనియర్ అధికారి అదనపు బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కొండగట్టు ఆలయ ఈఓగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం రామకృష్ణారావు రానున్నారు. నిజామాబాద్ ఇంచార్జ్ ఏసీగా, కరీంనగర్ కార్యాలయంలో సూపరెండెంట్‌గా పనిచేస్తున్న నాయిని సుప్రియ స్థానంలో బాసర ఇంచార్జ్ ఈఓగా ఉన్న విజయరామారావు రెగ్యులర్ నిజామాబాద్ ఏసిగా వ్యవహరించనున్నారు. అలాగే పలువురు ఈఓలకు కూడా స్థాన చలనం జరిగింది. ఇటీవల గ్రేడ్-2 ప్రమోషన్ పొందిన నాగారపు శ్రీనివాస్ కరీంనగర్ జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయానికి బదిలీ అయ్యారు. ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి ఆలయంలో పనిచేస్తున్న గ్రేడ్-1 ఈఓ సుధాకర్‌ను కరీంనగర్ మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో గ్రేడ్-2 ఈఓగా పనిచేస్తున్న ఎండపల్లి మారుతి గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ఈఓగా బదిలీ అయ్యారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో పనిచేస్తున్న గ్రేడ్-2 ఈఓ నాగుల అనిల్‌కుమార్ తిమ్మాపూర్ మండలం నల్లగొండ సీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గ్రేడ్-2 ఈఓ శంకరయ్య మంథని లక్ష్మీనారాయణ దేవాలయానికి బదిలీ అయ్యారు. జగిత్యాల రాజరాజేశ్వరస్వామి దేవాలయ ఈఓగా ఉన్న కాంతారెడ్డి స్థానంలో పి వామన్‌రావు బాధ్యతలు చేపట్టనున్నారు.



ముగ్గురు కోళ్ల దొంగల అరెస్టు


సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, జూలై 31: జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం విలువైన కోళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న యువకులను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నాటు కోళ్లు, విలువైన పందెం కోళ్లను దొంగతనం చేయడం వృత్తిగా ఎంచుకున్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన చీటి సతీష్‌రావు ఇంటివద్ద గల కోళ్ల ఫారం నుంచి ఇరవై కోళ్లను ఈ నెల 26న కారులో వచ్చి ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోళ్లను ఎత్తుకెళ్లింది ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మేచర్ల ఏసుబాబు, వీర్లపాడు మండలం గోకరాజుపల్లి కాలనీకి చెందిన గ్యార విష్ణు, జమ్మాళం బీసీ కాలనీకి చెందిన మేచర్ల కిషోర్‌లుగా నిర్ధారించారు. కోళ్లను అమ్ముకునేందుకు కారులో వెళుతుండగా బుధవారం ఉదయం సుల్తానాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. వీరి నుంచి 22 కోళ్లను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని ఏసీపీ తెలిపారు. అరెస్టు అయిన వారిలో కిషోర్‌పై ఐదు కేసులు, విష్ణుపై రెండు కేసులు, మేచర్ల ఏసుబాబుపై ఏడు కేసులు ఆంధ్రప్రదేశ్‌లో నమోదై ఉన్నాయని వివరించారు. వీరు దొంగిలించే కోళ్లు ఒక్కొక్కటి యాభై వేల రూపాయల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని, అలాంటి కోళ్లను ఎత్తుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుని జల్సా చేసుకుంటారన్నారు. దొంగలను పట్టుకున్న ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, పీసీలు తిరుపతి నాయక్, రమేష్, రాజ్‌కుమార్‌లను ఏసీపీ అభినందించారు. సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు.





FARNAZ

బైక్ పైనుంచి పడి ఒకరి మృతి

చొప్పదండి, జూలై 31: మండలంలోని వెదురుగట్టుకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి మృతిచెందాడు. ఎస్ఐ అనూష తెలిపిన మేరకు.. వెదురుగట్టుకు చెందిన జిల్లా శంకరయ్య (52)ఆటో నడుపుకుంటూ వ్యవసాయం చేస్తుంటాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా బైక్ అదుపు తప్పి శంకరయ్య కింద పడిపోయాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శంకరయ్య మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న జిల్లా శంకరయ్య మృతదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలు

గంభీరావుపేట, జూలై 31: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన తీర్పు వెల్లడించినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకా రం.. కోనారావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన కుంట నాగరాజుకు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన వసంతతో 2005లో వివాహం జరిగింది. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నేళ్లకు అదనపు కట్నం కోసం భర్త నాగరాజు వేధింపులకు గురిచేయగా 2009లో గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో వసంత ఫిర్యాదు చేసింది. పోలీస్‌లు నాగరాజుపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యమగంటి సతీష్‌గౌడ్ వాదించారు. గంభీరావుపేట ఎస్సై, సీఎంఎస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్‌రెడ్డి ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో నిందితుడు నాగరాజుకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమ న్యాయమూర్తి సృజన తీర్పు చెప్పినట్టు ఎస్సై వివరించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

వీణవంక,జూలై31:మండలంలోని బొంతుపల్లి గ్రామనికి చెందిన పోలు సత్తమ్మ (84)బావిలో పడి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం బహిర్భుమికి వెళ్లి చాలాసేపు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అనుమానంతో ఇంటి దగ్గరలోని బావిలో వెతకగా శవమై కనిపించినట్లు తెలిపారు.మా తల్లి మతిస్థిమితం సరిగా లేక బహిర్భుమికి వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్టు మృతురాలు కూమారుడు పోలు మల్లేష్ పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఇసుక డంపులపై పోలీసుల దాడులు

మానకొండూర్, జూలై 31 : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సుమారు 40 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకొని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు లింగాపూర్‌లోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న టీఎస్ 02 యుసి 9929 ఇసుక ట్రాక్టర్‌ను మండలంలోని అన్నారం గ్రామంలో పట్టుకొని డ్రైవర్ అనిల్, యజమాని తాళ్ల సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

మానకొండూర్, జూలై 31 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. టిప్పర్ డ్రైవర్ నేర్నాల శ్యాం, యజమాని పిల్లి మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

కరీంనగర్ అర్బన్, జూలై 31: ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. కోరుట్లలో విధులు నిర్వహిస్తున్న జ్యోతి ఐజీ కార్యాలయానికి, డీఐజీ కార్యాలయంలో పనిచేసే డి సుజాత జగిత్యాలకు బదిలీ అయ్యారు. డి అశోక్ ఆదిలాబాద్ నుంచి కోరుట్లకు బదిలీ అయ్యారు. జె షన్‌నాయక్ జగిత్యాల నుంచి భీమదేవరపల్లికి, ఎండీ మక్సూద్ అలీ హుజూరాబాద్ నుంచి ఆదిలాబాద్ ఆడిట్‌కు బదిలీ అయ్యారు. ఎం బాలకిషన్ లక్షెట్టిపేట నుంచి రామగుండం, అప్పారావు సుల్తానాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. బి ప్రియాంక మంథని నుంచి మంచిర్యాలకు, ఎల్ ఉమాదేవి కరీంనగర్ డిఐజీ కార్యాలయం నుంచి ఆడిట్‌కు, జె మనోహర్ కరీంనగర్ ఆడిట్ నుంచి చేర్యాలకు, ఎస్ రాజేష్ కరీంనగర్ రూరల్ నుంచి గజ్వేల్‌కు, జె పద్మ గంగాధర నుంచి ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎస్‌పార్థసారథి సిరిసిల్ల నుంచి కరీంనగర్ డీఐజీ కార్యాలయానికి, సీహెచ్ సురేంద్రబాబు వేములవాడ నుంచి ఎల్లారెడ్డికి, ఆర్ వెంకటవీరస్వామి రామాయంపేట నుంచి సిరిసిల్లకు, ఎండీ ఇంతియాజ్ హుస్నాబాద్ నుంచి హుజూరాబాద్‌కు, అఫ్జల్‌నూర్‌ఖాన్ ఎల్లారెడ్డి నుంచి గంగాధరకు, ఎండీ అబ్దుల్ జబ్బర్ దోమకొండ నుంచి హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది..

ఇసుక లారీల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 31: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఖాజీపూర్ వాగు నుంచి లారీలలో అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలోని పెద్దకాల్వల, బాబుపేట్, తారకరామానగర్ గ్రామాలకు చెందిన వాహన డ్రైవర్లు గుండవేని నాగేష్, దూల వెంక టేష్, పల్లపు కుమార్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బీమా చెక్కులు అందజేత

కరీంనగర్ క్రైం, జూలై 31: ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఇటీవల వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు బుధవారం అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు) ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఉమ్మడి జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి అందిన ఇన్సూరెన్సు చెక్కులను అందజేశారు. సిరిసిల్ల జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి, కామారెడ్డి జిలాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి వేర్వేరుగా నాలుగు లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మైలారపు లింబాద్రి


ఎన్నిక పత్రం అందుకుంటున్న మైలారపు లింబాద్రి

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మైలారపు లింబాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లింబాద్రికి ఎన్నికల అధికారి ముక్తా శ్రీనివాస్ నియామక పత్రం అందించారు. అనంతరం టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. లింబాద్రి పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ ఎన్నికకు కృషి చేసిన జిల్లా సంఘ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వెల్దుర్తి పశు వైద్యశాల సందర్శన

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జగిత్యాలరూరల్, జూలై 31: జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి పశువైద్యశాలను బుధవారం జగిత్యాల జిల్లాపశువైద్యాధికారి డాక్టర్ వేణు గోపాల్‌రావు సందర్శించారు. ఈనెల 29న శిథిలావస్థలో పశువైద్యశాల అనే కథనం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితమైంది. స్పందించిన జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలను సందర్శించి గ్రామస్థుల ద్వారా పశువైద్యశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పశువైద్యశాలకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతామని, గ్రామంలో దవాఖానాకు ఓ గదిని కేటాయించి వైద్యసేవలను అందిస్తామని తెలిపారు. శాశ్వత భవననిర్మాణ నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించామని, మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలను పాడుచేసుకోవద్దు

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు

మెట్‌పల్లి రూరల్, జూలై, 31: విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను పాడుచేసుకోవద్దని మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు అన్నారు. బుధవారం మెట్‌పల్లి జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలు వాటి దుష్పరిణామాలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను మొదటగా సరదాగా తీసుకున్నా తరువాత బానిసలుగా మారుతున్నారన్నారు. మత్తులో హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ భవిష్యతను కోల్పోతున్నారన్నారు. మాదక, మత్తు పదార్థాలు తీసుకొని జీవితాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోతూ సమాజానికి, కుటుంబానికి దురమవుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎల్లపుడు ప్రత్యేక దృష్టి సారించి వారి ఆలోచనలు, అలవాట్లను గమనించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోవిందుల వెంకటేష్, గంగాధర్, శ్రీనివాస్, జగపతి, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ప్రతిభ, మంజుల, స్వర్ణలత, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతు చేపట్టాలి

మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేత

మెట్‌పల్లి రూరల్, జూలై, 31: మెట్‌పల్లి నుంచి ఇబ్రహీంపట్నం మండలం మధ్య దెబ్బతిన్న జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు అధికారులను కోరారు. బుధవారం మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయంలో ప్రయాణికుడు మహమ్మద్ యాసీన్ వినతిపత్రం అందజేసి సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాల మధ్య ఉన్న జాతీయ రహదారి గుంతలతో ప్రమాదకరంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడంతో వాహనదారులు భయంతో ప్రయాణం చేస్తున్నారన్నారు. అధికారులు గుంతలు పడ్డ రహదారిని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా వెంకట్రావుపేట శివారులోని కల్వర్టుకు సైడ్ వాల్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేయాలి

సారంగాపూర్, జూలై, 31: ప్రతి గ్రామంలో ఏమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేయాలని ఏమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బుధవారం సారంగాపూర్ మండల అధ్యక్షులు దుమాల వంశీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జెండా గద్దె నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా మాదిగల న్యాయ పరమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం జరుగుతున్న ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదని విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తమకు అన్యాయం జరుగుతోందని ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కృషి వల్ల తమకు త్వరలోనే న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, జిల్లా అధికార ప్రతినిధి పొందేటి సునిల్, మండల అధ్యక్షులు దుమాల వంశీ, జిల్లా నాయకులు బెజ్జంకి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

రాయికల్, జూలై 31: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని 12వ వార్డులో బుధవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ బి.వెంకటి, 12వ వార్డు ఆఫీసర్ పి.గంగారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే నిరంతరాయంగా విద్యుత్


కోనాపూర్‌లో మహిళా రైతులతో మాట్లాడుతున్న దావ వసంత

సారంగాపూర్, జూలై, 31: కేసీఆర్ హయాంలోనే నిరంతరాయంగా కరెంట్ వచ్చేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. ముందుగా శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోనాపూర్ గ్రామంలో పంట పొలాల్లో నాటు వేస్తున్న మహిళ రైతుల వద్దకు వెళ్లి పలకరించారు. ఈ సందర్భంగా పెన్షన్ వస్తుందా, సక్రమంగా రుణమాఫీ జరిగిందా, కరెంట్ ఎలా వస్తుంది.. అంటూ వివరాలు తెలుసుకున్నారు. ఇంతవరకు రూ.4వేల పెన్షన్ అందలేదని రుణమాఫీ జరగలేదని కరెంట్ సక్రమంగా రావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ సహకార సంఘం అధ్యక్షులు సాగి సత్యంరావు, మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, నాయకులు తేలు రాజు, అత్తినేని నరేష్, సీనియర్ నాయకులు లింగారెడ్డి, రాజిరెడ్డి, అలిం, వెంకటేష్, రమేష్, రాజ్‌కుమార్, రాంబాబు, రమేష్, శేఖర్, అరవింద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి



వాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు పాల్గొన్న ఎస్పీ అశోక్‌కుమార్, మల్యాలలో హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న ఎస్సై, పోలీసులు

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండు వద్ద హెల్మెట్ అవగాహన ర్యాలీని ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో పోలీసులు అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తరుచుగా రోడ్డు ప్రమాదం జరిగే ప్రాంతాలను గుర్తించామని, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వ యంతో జిల్లాలో 44 బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలను నివారించడానికి ప్రయత్ని స్తున్నామన్నారు. వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐలు తిరుపతి, సుధీర్ రావు, ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి..

మల్యాల: వాహనదారులు వాహనాలు నడిపేప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై నరేష్ అన్నారు. కొండగట్టులో బుధవారం ట్రాఫిక్‌కు సంబందించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానికులతో కలిసి హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యువకులు, పోలీసులు పాల్గొన్నారు.

కొడిమ్యాల రేంజర్‌గా మొయినుద్దీన్


మోయినుద్దీన్‌కు స్వాగతం పలుకుతున్న అధికారి

కొడిమ్యాల, జూలై 31: కొడిమ్యాల రేంజర్‌గా అదిలాబాద్ జిల్లా బీరుసాయిపేట రేంజ్ నుంచి బదిలీపై వచ్చిన గులాం మొయినుద్దీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రేంజర్‌కు అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. కొడిమ్యాలలో రేంజర్‌గా విధులు నిర్వహించిన బుర్ర లత అజంనగర్‌కు బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్తున్న రేంజర్ లతను రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు, సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కొడిమ్యాల, కొండగట్టు డిప్యూటీ రేంజర్‌లు ముషీర్‌అహ్మద్, మోనిక, ఒగులాపూర్ సెక్షన్ ఆఫీసర్ రత్నమ్మ, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల వినతిపత్రం


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల సాధన కోసం జగిత్యాల జర్నలిస్టులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం ఇందిరా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు మాట్లాడారు. మూడు దశాబ్ధాలుగా పాత్రికేయ రంగంలో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న జర్నలిస్టులకు ఇప్పటివరకు ఇళ్ల స్థలాల అందలేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఎన్నోఏళ్లుగా ఎంతో మంది ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) అధ్యక్ష, కార్యదర్శులు చీటి శ్రీనివాస్ రావు, అలుగునూరి ప్రదీప్ కుమార్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలు అరికట్టవచ్చు

- విద్యుత్ ట్రాన్స్‌కో డీఈ తిరుపతి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో డీఈ తిరుపతి

మెట్‌పల్లి రూరల్, జూలై 31: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ట్రాన్స్‌కో డీఈ తిరుపతి సూచించారు. బుధవారం మండలంలోని ఆత్మకూర్‌లో పొలం బాట కార్యక్రమంలో భాగంగా రైతులకు విద్యుత్ ప్రమాదాల భారిన పడకుండా రైతులకు, ప్రజలకు సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలతో భూమి పూర్తిగా తడిసిపోయి ఉంటుందని, దీనికి తోడు గాలి దుమారం తో విద్యుత్ తీగలు తెగిపడతాయని, స్తంభాల వద్ద పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు పొలాల్లో కరెంటు స్టార్టర్‌కు ఇనుప డబ్బాలు కాకుండా ఫైబర్ డబ్బాలు అమర్చుకోవాలన్నారు. మోటార్లకు కెపసిటర్లు మార్చుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా రూ. 1.25 కోట్లతో పరిష్కరించినందుకు అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ట్రాన్స్‌కో ఏడీ మనోహర్, నీవన్, అజయ్, మధు, నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, భూమారెడ్డి, దిలీప్‌గౌడ్, నరేష్, నవీన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతిరైతుకు రుణమాఫీ చేయాలి

మెట్‌పల్లి రూరల్, జూలై 31: నియోజక వర్గంలో అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ పథకం అమలయ్యేలా చూడాలని అధికారులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. రుణమాఫీ కానీ రైతుల లిస్టుతో బుధవారం మండలంలోని వేంపేట గ్రామంలోని సిండికేట్ బ్యాంకులో వ్యవసాయాధికారి ఏడీఏ లావణ్య దృష్టి తీసుకెళ్లి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన రుణమాఫీలో సాంకేతిక కారణాలతో ఏ రైతుకైనా అందకపోతే వారందరికీ మాఫీ వర్తించేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు రుణమాఫీ అందకపోవడానికి గల కారణాలు తెలుసుకోవడానికి ఆధార్‌కార్డ్‌తో మండలాల్లోని వ్యవసాయ అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చునిఏడీఏ లావణ్య సూచించారు.

ఎక్స్‌లెన్స్ గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్న డాక్టర్ హేమరెడ్డి



ఇబ్రహీంపట్నం(మెట్‌పల్లి), జూలై 31: పట్టనంలోని నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన ఆన్వి హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ చిట్నేని హేమరెడ్డి ఎక్స్‌లెన్స్ గ్లోబల్ ఐకాన్ సెకండ్ ఎడిషన్ అవార్డును బాలీవుడ్ హీరోయిన్ శిల్పాశెట్టి చేతుల మీదుగా అందుకున్నారు. 2024 సంవత్సరానికి గానూ ఇన్ ఫెర్టిలిటీ, ఆండ్రాలజీ విభాగాల్లో విశేష సేవలు అందించినందుకు గానూ బుధవారం డిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్లోబ్ ఐకాన్ సంస్థచే ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఎంతోమంది ప్రజల సంతాన ఉత్పత్తి సమస్యలను పరిష్కరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించినట్లు గుర్తించి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు డాక్టర్ హేమరెడ్డిని పలువురు అభినందించారు.

ఘనంగా బోనాల వేడుకలు

కోరుట్ల, జూలై 31: పట్టణంలోని మున్నూరు కాపు సంఘ ఆధ్వర్యంలో బుధవారం బోనాల వేడుక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డుల నుంచి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో మహిళలు బోనాలతో శోభయాత్ర నిర్వహించారు. గ్రామ శివారులోని పోచమ్మ, మహాలక్ష్మి దేవతలకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైయిన జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బండారి శంకర్‌ను సంఘ సభ్యులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మున్నూర్ కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

బీర్‌పూర్, జూలై 31: పోక్సో, అట్రాసిటీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందన్ తెలిపారు. ఓ బాలిక మండలంలోని అమ్మమ్మ గ్రామానికి రావడంతో కోరుట్ల మండలం పైడిమడుగుకు చెందిన కనుకం రంజిత్(19) అనే యువకుడు బాలికలకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని బాలిక తల్లి జూలై 12వతేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న క్రమంలో బుధవారం నిందితుడు కనుకం రంజిత్‌ను అరెస్టు చేసి పోక్సో, అట్రాసిటీ కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

భీమారం, జూలై 31: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి రఘువరణ్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో ఒకరికి డెంగ్యూ రావడంతో వారి ఇంటికి వెళ్లి, వార్డును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంట్లో వ్యక్తిగత పరిశుభ్రత ఉంచుకోవాలని, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరా లు ఎక్కువగా వస్తున్నందున ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శంకర్, ఎంపీడీవో పద్మావతి, ఎంపీవో నీలిమ, వైద్యురాలు రమ, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, కార్యదర్శి లక్ష్మి, ఏఎన్ఎం సుమలత, ఎంఎల్‌హెచ్‌పి సిద్ధార్థ, కారోబార్ వనిత, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశా'ల సమస్యలపై ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడడం విడ్డూరం

ఇబ్రహీంపట్నం,(మెట్‌పల్లి) జూలై 31: ఆశా వర్కర్ల సమస్యలపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు ఎండీ రాయిస్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలు అందించిన ఆశా వర్కర్లకు ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు గాని ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ గాని ఎలాంటి సహాయం చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో ఆశ వర్కర్లకు కనీసం అదివారం సెలవు కూడ ఇవ్వకుండ వెట్టి చాకిరి చేయించింది నిజం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజీం, ప్రసాద్, ఎల్లేష్, నాగేష్ పాల్గొన్నారు.

మల్లాపూర్: ఆశా వర్కర్ల గురించి ఎమ్మెల్యే మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ జనరల్ కార్యదర్శి బోయిని హన్మండ్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్లకు అండగా ఉండి వారి డిమాండ్లు పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జావిడి రాజారెడ్డి, సాంగ సందీప్‌యాదవ్, నూతిపెల్లి కృష్ణవేణు, ఎర్ర సాయికుమార్, చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్ష, అంటరానితనాన్ని పారదోలాలి

పెగడపల్లి, జులై 31 : గ్రామీణ ప్రాంతాలలో అక్కడక్కడా అగుపిస్తున్న కులవివక్ష, అంటరానితనం అనే దురాచారాలను కూకటివేళ్లతో పారదోలాలని పెగడపల్లి మండల పంచాయతీ అధికారి మహేందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాములపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి, సమాజంలో పౌరులందరు సమానులేనని, అంటరానితనం పాటించవద్దని, మూఢ నమ్మకాలు వీడాలని అవగాహన కల్పించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, గిర్దావర్ శ్రీనివాస్, ప్రత్యేకాదికారి శంషేర్ అలీ, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దీకొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

కోరుట్ల, జూలై 31: ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు ఎంఈవోలు, జేఎల్ డైట్ లెక్చరర్‌గా పదోన్నతులు ఇప్పిస్తామని పీఆర్‌టీయుటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, అనందర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న శోభారాణి పదివీ విరమణ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకులు పాల్గొని ఉపాధ్యాయురాలిని సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను, ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ ఇప్పిస్తామని అన్నారు. జీవో 317లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌యుటీఎస్ ఉపాధ్యాయ సంఘ సభ్యులు అబ్దుల్ వాజీద్, శ్రీనివాస్‌రావు, సర్తాజ్ అహ్మద్, శ్రీనివాస్, సురేఖ, యూసుఫ్ అలీ, జయప్రద, కృష్ణ ప్రవీణ్, సైపోద్దిన్, జ్యోతి లక్ష్మి, శ్రీనివాస్, బాలాజీ గంగాధర్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని యువకుడి మృతి

జగిత్యాలరూరల్, జూలై 31: మండలంలోని తాటిపల్లి శివారులో ఎక్స్‌కవేటర్ ఢీకొని కోరుట్ల పట్టణానికి చెందిన పోతుగంటి గౌతమ్(24) అనే యువకుడు బుధవారం మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం గౌతమ్ అల్లీపూర్ నుంచి కోరుట్లకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో తాటిపల్లి శివారులో జంగిలి పవన్ కళ్యాణ్ అనే యువకుడు తన ఎక్స్‌కవేటర్‌తో అతివేగంగా అజాగ్రత్తగా నడిపి గౌతమ్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో గౌతమ్ తలకు, ముక్కుకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

రాయికల్: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వెస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ షఫియోద్దీన్ సూచించారు. మండలంలోని ఇటిక్యాల గడి ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

కొడిమ్యాల: రాష్ట్ర ప్రభుత్వం మొదట రూ.. లక్ష లోపు రుణ మాఫీ అందరికీ వర్తింప చేయాలని పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.. లక్షన్నర లోపు రుణమాఫీ అమలుకు ఆదేశాలు ఇవ్వటం అభినందనీయమన్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి బుధవారం పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని ఆశీర్వచన మండపంలో అదిరే అభిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదం అందించారు.

కోరుట్ల: ఉద్యోగంలో మంచి సేవలు అందించినప్పుడే పదవీ విరమణ తరువాత మంచి గుర్తింపు లభిస్తుందని కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి ఆనంద్ కుమార్ అన్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బీఏవోగా పని చేస్తున్న యాద రవీందర్ పదవీ విరమణ బుధవారం పొందగా కార్యాలయ సిబ్బందితో పాటు మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొని అభినందించారు.

రాయికల్: విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్ది సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని మూటపెల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు రాజేందర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు.

- విద్యార్థులు ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

పెగడపల్లి: వ్యవసాయశాఖ నిబంధనలు పాటిస్తూ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు సాగించాలని ధర్మపురి ఏడీఏ రాంచందర్ పేర్కొన్నారు. బుదవారం పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను ఏడీఏ రాంచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

- జాతీయ మాలమహానాడు పిలుపు మేరకు చేపట్టిన హలో మాల చలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పొనగంటి రాజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం మండల మాల మహానాడు నాయకులతో కలసి రాజయ్య హలో మాల చలో డిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించారు.

కథలాపూర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు యూనిఫాం మహిళా సంఘాలతో కుట్టు వేయిస్తున్నట్టు సెర్ప్ ఏపీఎం నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. పోతారంలో మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. బాలుర డ్రెస్సుకు కుట్టు కోసం రూ. 80, బాలికలకు రూ. 60ల చొప్పున చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు.

కథలాపూర్: వరంగల్ డిక్లరేషన్ ప్రకారం రాహుల్ గాంధీ ప్రకటించిన రు. 2 లక్షల రుణమాఫీ రేవంత్‌రెడ్డి సర్కారు హామీని నిలబెట్టుకుంటోందని కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, అజీం పేర్కొన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

కోరుట్ల రూరల్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండలంలోని సంగెంలో పౌర హక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించి చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గంగాధర్

రాయికల్, జూలై 31: విద్యార్థుల అభివృద్ధికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంఈవో ములస్తం గంగాధర్ అన్నారు. రాయికల్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఎన్ఏఎస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ టెక్స్ బుక్స్ వర్క్ బుక్స్‌కు అనుసంధానంగా పాఠాలను బోధించాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో పటిష్టంగా అమలుపరిచే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ కొక్కు రాజేష్, మండల నోడల్ అధికారి శ్రీపతి రాఘవులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కుడుకుల రవీందర్, విషయ నిపుణులు వేల్పుల గంగరాజం, దొంతి సతీష్, చెక్కపల్లి రాజేందర్, ఊషకోల రాము తదితరులు పాల్గొన్నారు.